మూత'బడు'తున్నాయి..!

- పదిహేనేళ్లలో 20పాఠశాలలు మూత
- కొన్ని స్కూళ్లలో ఐదు లోపే విద్యార్థులు
- ప్రైవేట్ వైపే తల్లిదండ్రుల మొగ్గు
- ప్రశ్నార్థకంగా మారిన సర్కారు బడులు

డోర్నకల్: డోర్నకల్ మండలంలో పలు కారణాలతో ప్రభుత్వ పాఠశాలలు ఒక్కొక్కటిగా మూతబడుతున్నాయి. మండలంలో 60 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో ఇప్పటి వరకు 19 పాఠశాలలు మూతబడగా కొన్ని పాఠశాలల్లో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య ఐదు లోపే ఉండడంతో నిర్వహణ కష్టతరంగా మారింది.

గొల్లచర్ల పాతగ్రామపంచాయతీ పరిధిలోని లచ్చాతండా, రాముతండా, వీరనాయక్‌తండా, ఉయ్యాలవాడ పంచాయతీ పరిధిలోని మాన్యాతండా, సత్యాతండా, ఎస్సీ కాలనీ, ఇస్రాతండా, టేకులతండా, వెన్నారం పరిధిలోని లకావత్‌తండా, రామకుంటతండా, అందనాలపాడు పరిధిలోని అందనాలపాడు, మోదుగగడ్డతండా, దుబ్బగడ్డతండా, చిలుకోడు పరిధిలోని సీతారాంపురం, తహసీల్దారు బంజర పరిధిలోని తహసీల్దారు బంజర, అహ్మద్‌నగర్, డోర్నకల్ పరిధిలోని రాజుతండా, టంకుతండా, సిగ్నల్‌తండా, శాస్త్రినగర్ పాఠశాలలు మూతబడ్డాయి. వీటితోపాటు చాప్లాతండా, బంకట్‌సింగ్ తండా, ఎర్రకుంటతండా పాఠశాలల్లో ఒకరిద్దరు విద్యార్థులే ఉండగా గుర్రాలకుంటతండా, కస్నాతండా, పాతదుబ్బతండా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఐదులోపే ఉంది.


సిగ్నల్‌తండాలో మూతబడిన ప్రభుత్వ పాఠశాలలో బసచేసిన వలస కార్మికులు

కారణాలివే...

ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు విరివిగా పెరగడంతో తల్లిదండ్రులు వాటివైపు మొగ్గు చూపుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉదయం ఇంటి ముందుకు వచ్చి పిల్లలను తీసుకెళ్లి సాయంత్రం ఇంటి ముందు దించుతున్న ప్రైవేట్ స్కూల్ వాహనాలు, ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరి, సమయపాలన పాటించకపోవడంచ, పాఠశాలలకే పరిమితమై విద్యార్థుల సామాజిక ఆర్థిక స్తోమతను అధ్యయనం చేయకపోవడం, పాఠశాలల్లో వసతుల కొరత వంటి కారణాలతో విద్యార్థులు లేక మూతబడుతున్నాయి.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: రైతుల కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కర్కాల గ్రామ శివారులోని బయన్నవాగు ద్వారా పాలేరు వాగుకు విడుదల చేసిన నీటిలో ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, నాయకులు నిరంజన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, హమ్యానాయక్, సంతోష్, సోమరాజశేఖర్, మేకల కుమార్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

పెద్దవంగర: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో చెక్‌డ్యాం వద్ద ఎస్సారెస్పీ నీటి ప్రవాహాన్ని స్థానిక రైతులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దసాని సురేష్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా కొబ్బరికాయలు కొట్టి పూజలు చేపట్టి పూలను నీటి ప్రవాహంలో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడారు. బయన్న రిజర్వాయర్ ద్వారా సాగు రైతుల సంక్షేమం కోసం విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీన్‌రావు, నాయకులు రాజు యాదవ్, మురళీ, గోపాల్, వెంకన్న, రవి, సీతారాంనాయక్, ఉపేందర్ పాల్గొన్నారు.


తొర్రూరు రూరల్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ఇసుక రవాణా కట్టడికి చెక్‌పోస్టులు

మహబూబాబాద్ రూరల్: ఎస్పీ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణా కట్టడి కోసం మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ, కురవి మండలంలోని నేరడ క్రాస్ రోడ్డు వద్ద మహబూబాబాద్ రూరల్, కురవి పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు సతీష్, దీపిక, ప్రొబేషనరీ ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

కేసులు నమోదు చేస్తాం..

గార్ల: ప్రభుత్వ అనుమతి లేకుండా పాకాల ఏరు, వాగులు, చెరువుల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకాసురులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై రియాజ్‌పాషా హెచ్చరించారు. మండలంలోని సత్యనారాయణపురం క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ ను ఎస్సై ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సిరాజ్‌పాషా, వీరబత్తిని రాము పాల్గొన్నారు.


మహబూబాబాద్ రూరల్: చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసిన పోలీసులు

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

మరిపెడ రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి, సంబంధిత నలుగురు ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బొలగాని సతీష్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని వెంకంపాడు, బావోజిగూడెం, అజ్మీరతండా, బాల్నిధర్మారం గ్రామ శివారు పాలేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. డ్రైవర్లు బాధవత్ హరికృష్ణ, కొంపెల్లి మహేష్, భూక్య చంటి, ముదిరెడ్డి సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తిరుపతమ్మ–గోపయ్య కల్యాణ మహోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

గార్ల: గార్లలోని తిరుపతమ్మ దేవాలయంలో గోపయ్య సమేత తిరుపతమ్మ కల్యాణ మహోత్సవను బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీరామశాస్త్రి మంత్రోచ్చారణల నడుమ కల్యాణం తంతును ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా పీటలపై శీలంశెట్టి రాంభద్రయ్య సుభద్ర, శీలంశెట్టి రామకోటేశ్వరరావు, శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, కోటేష్ దంపతులు కూర్చున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణంను తిలకించి భక్తి పారవశ్యం పొందారు. కల్యాణ మహోత్సమంలో మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, మాజీ సర్పంచ్‌లు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, అజ్మీర బస్సీలాల్, ఎస్.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి



డోర్నకల్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని డోర్నకల్ సీఐ బి.రాజేష్ కోరారు. సీరోలు మండలం అందనాలపాడు గ్రామంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గంజాయి, డ్రగ్స్, గుడుంబా వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వంశీధర్ పాల్గొన్నారు

'చలో హైదరాబాద్' కరపత్రాల ఆవిష్కరణ


గూడూరు: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కురవి: సీఎం రేవంత్‌రెడ్డి అవలంబిస్తున్న అప్రజాస్వామిక పద్ధతులను ప్రతిఘటించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్‌కె మదార్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయితండాలో ఈనెల 16వ తేదీన చలో హైదరాబాద్(ఓంకార్ భవనం)లో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్, నాయకులు లింగన్న, సూర్య, భాస్కర్, నరేష్, కోబల్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు దొంతోజు ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఈనెల 16న చలో హైదరాబాద్ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రణధీర్, ఉపేందర్, బాబు, వీరన్న, వీరస్వామి, అతిరాం, నరేష్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని బాలరక్షా భవన్‌లో బుధవారం తప్పిపోయిన మంద బుద్ధి గల బాలుడిని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, కమిటీ సభ్యులు డాక్టర్ డేవిడ్, డాక్టర్ అశోక్, సిబ్బంది వెంకన్న, రమేష్ సమక్షంలో తల్లికి అప్పగించారు. ఈసందర్భంగా నాగవాణి మాట్లాడుతూ.. ఈనెల 3న ఏలూర్ జిల్లా తాడిపల్లిగూడెంకు చెందిన కొంత మంద బుద్ధి ఉన్న బాలుడు రైలు ఎక్కి మానుకోట రైల్వేస్టేషన్‌లో దిగారన్నారు. ఆ తర్వాత మానుకోట నుంచి గూడూరు మండల కేంద్రానికి వెళ్లి బజార్‌లో తిరుగుతుండగా ఎస్.గిరిధర్ సీడబ్ల్యూసీకి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఏలూరు ఐసీడీఎస్ సహకారంతో హైదరాబాద్‌లో వెతుకుతున్న తల్లికి సమాచారం ఇచ్చామన్నారు. 10రోజులపాటు తల్లితో బాలుడి బంధువులు, పలు ప్రాంతాలలో వెతికినట్లు ఆమె పేర్కొన్నారు.


తప్పిపోయిన బాలుడిన తల్లికి అప్పగిస్తున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

మహబూబాబాద్ రూరల్: కురవి మండలంలోని రేకులతండా, బాలుతండా, హరిదాస్ తండా, కంచర్లగూడెం తండాల్లో ఎక్సైజ్ స్టేషన్, డీటీఎఫ్, వరంగల్ ఎన్‌ఫోర్సుమెంట్, హైదరాబాద్ ఎస్టీఎఫ్ టీం, కురవి పోలీసులులు బుధవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో 700 లీటర్లబెల్లం పానకం ధ్వంసం చేసి, 35లీటర్ల సారాయి, 120 కిలోలబెల్లం, 8 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురుపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దాడులలో ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నాగేశ్వర్ రావు, బిక్షారెడ్డి, నీరజ, ఎక్సైజ్ ఎస్సైలు అశోక్ కుమార్, చంద్రశేఖర్, కిరీటి, కురవి ఎస్సై సతీష్, పోలీసులు పాల్గొన్నారు.


దాడులు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

గిట్టుబాటు ధర చెల్లించాలి

నెల్లికుదురు: రైతులు పండించిన మిర్చి పంటకు గిట్టు బాటు ధర కల్పించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండలంలోని ఆలేరులో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస ధర రూ.26వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, వెంకన్న, రమేశ్, సుధాకర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో హైదరాబాదు వెళ్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులను బుధవారం మహబూబాబాద్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సంఘం జిల్లా నాయకుల నీలం శ్రీనివాస్, మద్దెల రమేష్, పిట్టల శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనలో మున్నూరుకాపు జనాభాను తగ్గించి చూపుతుందని, ఇందుకు నిరసనగా సీఎం ఇంటి ముట్టడికి సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బుధవారం కేసముద్రంలో మున్నూరుకాపు సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు

క్లుప్తంగా

సమ్మక్క-సారలమ్మ జాతర



గూడూరు: మండలంలోని జగన్నాయకులగూడెం, దామరవంచ శివారు మహబూబాబాద్ వైపు జాతీయ రహదారి పక్కన్న చింతలగట్టు వట్టివాగు ఒడ్డున వెలసిన సమ్మక్క-సారలమ్మ మినీ జాతరను ఆదివాసీ గిరిజన సంప్రదాయం ప్రకారం పూజారులు (వడ్డెలు) బుధవారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్ కమిటీ ప్రతినిధులకు, పూజారులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.

కస్నాతండాలో..



డోర్నకల్: డోర్నకల్-బలపాల మార్గంలోని కస్నాతండా శివారు సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ఆలయ కమిటీ ప్రతినిధులు, పూజారులు జలబిందెలను ఊరేగించిన అనంతరం సమ్మక్క-సారలమ్మ గద్దెలకు అభిషేకం చేశారు. మొదటి రోజు గద్దెల వద్ద సమ్మక్క, సారలమ్మలను అలంకరించి పూజలు నిర్వహించారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

మహబూబాబాద్ అర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఉమ్మగాని మధు కృష్ణవేణిల పెద్ద కుమారుడు వశిష్ట గౌడ్ 98.14 శాతంతో ప్రతిభ చాటాడు.

ఎమ్మెల్యే పూజలు



కేసముద్రం: ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో లింగమంతుల స్వామి ఆలయంలో ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఇనుగుర్తి, కేసముద్రం మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు కూరెల్లి సతీష్, అల్లం నాగేశ్వర్‌రావు,తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా వివరాల వెల్లడి

గార్ల: స్థానిక సంస్థల ఎన్నికలపై అన్ని పార్టీల రాజకీయ నాయకులకు తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను ఎంపీడీఓ మంగమ్మ బుధవారం వెల్లడించారు. మండలంలో 30,894 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 15,106 మంది పురుషులు, 15,787 మంది స్త్రీలు ఓటర్లు ఉన్నారన్నారు. మండలంలో 62 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. ఈ సమావేశంలో నాయకులు దనియాకుల రామారావు, కందునూరి శ్రీనివాసరావు, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, కట్టిబోయిన శ్రీనివాస్, శీలంశెట్టి రమేష్, సత్యవతి, రాధాకృష్ణ, మురళీ పాల్గొన్నారు.

రాకింగ్ రాకేశ్ దంపతుల పూజలు



కురవి: మండల కేంద్రంలోని మహిమాన్వితమైన భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం ఇటీవల విడుదలై విజయవంతమైన కేశవచంద్రరమావత్(కేసీఆర్) చిత్ర నిర్మాత జబర్దస్త్ ఫేం రాకింగ్ రాకేశ్ ఆయన సతీమణి సుజాత పూజలు నిర్వహించారు.

సీతారామచంద్రస్వామి ప్రతిష్ఠాపన మహోత్సవం



కురవి: మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో బుధవారం అంకురార్పణతో సీతాలక్ష్మణహనుమత్సమేత శ్రీరామచంద్రస్వామి ఆలయ పంచకుండాత్మక ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. ఉదయం నుంచి వేదపండితులు శ్రీమాన్ వేంకట నృసింహాచార్యస్వామి సారథ్యంలో వేదపండితులు వేదమంత్రాల సాక్షిగా మూలవిరాటుల శోభాయాత్ర, నూతన యాగశాలలో వాస్తు శాంతి హోమము పర్యగ్నీకరణము, సాయంత్రం భగవదనుజ్ఞ విష్వక్సేనారాధన పుణ్యాహవాచనము, రక్షాబంధనం, ఆచార్య ఋత్విక్ వరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ తదితర పూజలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

వీల్‌చైర్ బహూకరణ

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) శివారు గుజిలితండాలో దివ్యాంగురాలు బాదావత్ ఉమకు బుధవారం హోప్‌స్టెప్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ నాగవెల్లి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా రూ.10వేల విలువైన వీల్‌చైర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో చిత్తనూరి శ్రీనివాస్, మలిశెట్టి వేణు, పగడాల కృష్ణారెడ్డి, చిప్పరపల్లి వెంకన్న పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకుడు

మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాదులోని గాంధీభవన్‌లో మండలంలోని చోక్ల తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూక్యా సుందర్ నాయక్ బుధవారం మర్యాదపూర్వంగా కలిశాడు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తికావోస్తున్న నేటికీ రాష్టానికి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల గౌతం అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు.

చర్య తీసుకోవాలి

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ గ్రామపంచాయతీలో ఇంటి నంబర్ల జారీలో అవకతవకలకు పాల్పడిన వారిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ మండల కన్వీనర్ మరిపెల్లి మొగిలి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: సీరోలు మండలం చిలుకొయ్యలపాడుకు చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకొయ్యలపాడుకు చెందిన మన్నెగూడెం పీఏసీఎస్ డైరెక్టర్ గజ్జి రమేష్ (48)కు సుమారు రూ.20లక్షల అప్పు ఉండడంతో ఎకరం భూమి అమ్మిన అప్పుతీరలేదు. దీంతో ఈనెల 5న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హైదరబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రైతులకు మోటార్ల అప్పగింత

డోర్నకల్: డోర్నకల్ పోలీసులు చోరీకి గురైన విద్యుత్ మోటార్లను గుర్తించి సంబంధిత రైతులకు అప్పగించారు. గతంలో రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోటార్లను స్వాధీనం చేసుకొని బుధవారం బాధితులకు అప్పగించారు.

స్వయంపాలన దినోత్సవం



దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, కల్పన, కృష్ణ, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

20న 'చలో హైదరాబాద్'

మహబూబాబాద్ రూరల్: ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు సామ పాపయ్య అన్నారు. కంబాలపల్లి గ్రామంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాబన్న, జంగిలి సోమనర్సన్న, పిప్పాల సోమన్న, నీలం భద్రయ్య పాల్గొన్నారు.

శునకాల నుంచి చిన్నారులను రక్షించాలి

బయ్యారం: మండలకేంద్రంలో పెరిగిపోయిన కుక్కల బారి నుంచి చిన్నారులను రక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోత్ దేవేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

విజయవంతం చేయాలి

పెద్దవంగర: ఈనెల 15న పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు సీతారాం నాయక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు గోపాల్ నాయక్, వెంకన్న, చంద్రశేఖర్, సోమన్న, ధరావత్ శంకర్, సోమన్న, మోతీరాం పాల్గొన్నారు.

ఒడిస్సీ నృత్య ప్రదర్శన

కురవి: సీరోలు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పిక్‌మెకీ బాసర ట్రిబుల్ ఐటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం కుమారీ ప్రజ్ఞాఘోష్ చేత ఒడిస్సీ నృత్య ప్రదర్శణ, దశావతార ప్రదర్శన నిర్వహించారు.

'రైతుభరోసా డబ్బులు తక్కువ పడుతున్నాయి..'

నర్సింహులపేట: రైతులకు పెట్టుబడి కోసం ప్రభుత్వం ఇస్తున్న రైతుభరోసాలో రైతులకు భూమికి తగినట్టు కాకుండా తక్కువగా పడుతున్నాయని రైతులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక ఎదుట ఆందోళన చేపట్టారు. భూమికి తగినట్టుగా డబ్బులు ఎందుకు పడటం లేదని రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారి వినయ్‌కుమార్‌ను, తహసీల్దార్ నాగరాజును నిలదీశారు. కార్యక్రమంలో రైతులు శ్రీశైలం, హోళీనాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గీత కార్మికుడి మృతి


వెంకన్న (ఫైల్)

పెద్దవంగర: విద్యుదాఘాతంతో ఓ గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన అనపురం వెంకన్న (55) కులవృత్తి కల్లు గీతతో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీ వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కేందుకు తాటివనంలోకి వెళ్తూ, ఓ రైతు కోతుల బెడద నుంచి తన మొక్కజొన్న చేనును కాపాడుకునేందుకు అమర్చిన విద్యుత్ తీగలు కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య అనసూర్య, కుమారుడు సాగర్, ఇద్దరు వివాహమైన కూతుర్లు ఉన్నారు.

కనుల పండువగా కల్యాణం

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. ప్రతి ఏటా మాఘమాసం పౌర్ణమి సందర్భంగా వేదపండితుల వేదమంత్రోచ్చరణల నడుమ కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాల్నే మృత్యుంజయ-దేవకమ్మలు తీసుకువెళ్లగా, కళ్యాణంలో భూక్య దేవిసింగ్-నీలవేణి, భూక్య భక్షీ-సరోజ దంపతులు కూర్చున్నారు.